ప్రజాశక్తి

మంగళవారం 31 అక్టోబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అప్రమత్తతపై చర్చ

◆ రైలు ప్రమాద ఘటనపై తాజా విశ్లేషణలు ◆ విశాఖలో పలువురికి చికిత్స

◆ క్షతగాత్రులను చూసి కన్నీరు మున్నీరవుతున్న కుటుంబీకులు



అలమండ - కంటకాపల్లి వద్ద జరిగిన ప్రమాద తీవ్రతను తెలియజెప్పే దృశ్యం



కెజిహెచ్‌లో దీనంగా క్షతగాత్రురాలు



రైల్వే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గ్యాంగ్‌మ్యాన్లు

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ, కోటవురట్ల, సీతమ్మధార, గోపాలపట్నం, విశాఖ కలెక్టరేట్ విలేకరులు

రైలు ప్రమాదాలను నివారించడంలో సిగ్నలింగ్ వ్యవస్థ, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా టెక్నాలజీ వినియోగం ఎంత ముఖ్యమో సిబ్బంది అప్రమత్తత కూడా అంతే ముఖ్యమన్న చర్చ విజయనగరం జిల్లా అలమండ – కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదానంతరం విశాఖ అంతటా సాగుతోంది. లోకో పైలట్లు ఎదుట కనిపించే పరిస్థితులపై తక్షణం స్పందించే తత్వం కలిగి ఉంటే కొంతమేర ప్రమాదాలను నివారించ వచ్చన్న వ్యాఖ్యలు వినిపి స్తున్నాయి. సిగ్నల్ సిస్టం ఎదురుగా ఫోకస్ అవుతున్న సమయంలో షార్ట్ కట్ పద్ధతుల్లో ఆలోచించడం కూడా ఇలాంటి ఘటనలకు ఆస్కారమిస్తుందన్న అంచనాను రైల్వే ఉన్నతాధికారులు వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలా వుండగా కేంద్ర రైల్వే శాఖ రైలు ప్రమాదాల నివారణకు అనుసరిస్తున్న విధానంపై వాల్తేరు రైల్వేలో గుసగుసలు వినిపిస్తున్నాయి. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఇదివరకే ఇచ్చిన నివేదికలో రైలు ప్రమాద వ్యవహారాలు, కేసుల్లో 65 శాతం మేర సరైన విచారణా నివేదికలను తయారు చేయలేదనేది స్పష్టమైన విషయం తెలిసిందే. దీంతో భద్రతకు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రాధాన్యతన్విడం లేదన్న విషయం ప్రస్ఫుటమవుతోంది. రైల్వే ఎక్విప్‌మెంట్ సరిగా పనిచేయకపోవడం కూడా ప్రమాదాలకు కారణమని కాగ్ తన నివేదికలో వెల్లడించినా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలూ, టెక్నాలజీని అప్‌గ్రేడ్ చేసేందుకు నిధుల కేటాయింపులూ చేయడం లేదన్నది స్పష్టమవుతోంది.

డిఎంయు పెట్టెలు తేలిక

ప్రమాదం జరిగిన వెంటనే డిఎంయు పెట్టెలు (బోగీలు) తేలిక మిగతా 2లో..

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి : సిపిఎం

ఘోర రైలు ప్రమాదానికి బాధ్యత వహిస్తూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు పార్టీ తరుపున ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ఈ ప్రమాదానికి కేంద్ర బిజెపి ప్రభుత్వానిదే బాధ్యతన్నారు. ప్రమాదంలో మరణించిన ప్రతి కుటుంబానికీ కేంద్రం రూ.50 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రులందరికీ మెరుగైన వైద్యాన్ని కార్పొరేట్ హాస్పిటల్స్‌లో అందించాలని కోరారు. పెరుగుతున్న రైలు ప్రమాదాలకు కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలే కారణమన్నారు.

లోకో పైలెట్ మృతి, కోటవురట్లలో విషాదఛాయలు

ఈ ప్రమాదంలో ఎన్ఎడి ప్రాంతంలో నివాసముంటున్న రాయగడ ప్యాసింజర్ లోకో పైలట్ ఎస్.మధు సూదన్ రావు అలియాస్ నాయుడు (52) మృతి చెందినట్లు రైల్వే అధికారులు ధ్రువీకరించారు. ఆయన అనకాపల్లి జిల్లాలోని కోటవురట్ల మండలం తంగేడు గ్రామానికి చెందినవాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మధుసూదనరావు మృతితో మండలం లోనూ, గ్రామంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన 30 సంవత్సరాల నుంచీ రైల్వేలో పని చేస్తున్నారు. ఇటీవలే లోకో పైలట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా ఉండే ఆయన మృతిని గ్రామస్తులు జీర్ణించు కోలేకపోతున్నారు.

విద్యా సంస్థల బంద్ పోస్టర్ ఆవిష్కరణ

▶ వార్త 8లో..

రాష్ట్రానికి బిజెపి తీవ్ర ద్రోహం

▶ వార్త 8లో..

భారీగా రైళ్ల రద్దు, దారి మళ్లింపు

▶ వార్త 2లో..

సిఎంకు ఆత్మీయ స్వాగతం



సిఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాద ప్రాంతానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెళ్లేందుకుగాను సోమవారం మధ్యాహ్నం 1.16 గంటలకు ప్రత్యేక విమానంలో ఆయన విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం అన్ని పనులూ ముగించుకుని 3.47కి విజయవాడకు తిరుగు ప్రయాణమయ్యారు. సిఎంకు పలువురు ఘన స్వాగతం పలికారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, సిపి ఎ.రవిశంకర్, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డిసిసిబి చైర్మన్ కోలా గురువులు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

సందడిగా ఉపేంద్రగాడి అడ్డా ట్రైలర్ లాంచ్

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ పతాకంపై నిర్మాత కంచర్ల అచ్యుతరావు స్వీయ సమర్పణలో నిర్మించిన 'ఉపేంద్రగాడి అడ్డా' సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం హోటల్ దసపల్లాలో ఘనంగా జరిగింది. హాస్య బ్రహ్మ బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హీరో ఉపేంద్ర నటించిన ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుందని తెలిపారు. తన అభిమాని, నిర్మాత అచ్యుతరావు నిర్మించిన సినిమా టీజర్ విడుదల చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఒకటీ రెండు సినిమాలు తీయడానికి కిందా.. మీదా పడుతున్న ప్రస్తుత తరుణంలో ఒకేసారి ఆరు సినిమాలు నిర్మించడం గొప్ప విషయమన్నారు. తద్వారా మిగతా 2లో..

ప్రైవేటీకరణ విధానాలపై 27, 28న మహాధర్నా



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి – కలెక్టరేట్ : ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలంటూ నవంబరు 27, 28 తేదీల్లో విజయవాడలో జరుగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. దేశంలో ప్రైవేటీకరణ విధానాలను అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న వైసిపి, తెలుగుదేశం, జనసేన పార్టీలను ఎన్నికల్లో ఓడించాలని అన్నారు. సోమవారం విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సిఐటియు జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని తరగతుల ప్రజానీకం మీదా తన దాడిని ఎక్కుపెట్టిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు అప్పగిస్తోందని తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేయడానికి కుట్రలు పన్నుతోందని అన్నారు. రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకు నష్టం చేసే విధంగా పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ క్రమంలో స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, రైతు పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, ప్రజలకు నష్టం చేసే విద్యుత్ సవరణ చట్టం – 2020ని రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్న డిమాండ్లతో దేశంలోని అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా నవంబరు 26, 27, 28 తేదీల్లో అన్ని రాష్ట్రాల్లో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ప్రైవేటీకరణ విధానాలపై 27, 28న మహాధర్నా

మహాధర్నాలు జరపాలని పిలుపునిచ్చాయన్నారు. అందులో భాగంగానే ఎపిలో ధర్నా జరుగనుందన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, బి.జగన్, ఎ.సీతాలక్ష్మి, జి.మంగశ్రీ, జి.అప్పలరాజు, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సిపిఎం ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను, నవంబరు 15న విజయవాడలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కౌన్సిల్ తీర్మానించింది.

అప్రమత్తతపై చర్చ

కావడంతో ఒకదానిపై ఒకటి ఎక్కేశాయని ఈ ప్రమాద ఘటనబట్టి తెలుస్తోంది. ఇంజిన్ బరువు వల్ల బలంగా గుద్దేయడంతో ఇలా బోగీలు అతలాకుతలమై ఒకేసారి 13 మంది ప్రాణాలను బలిగొన్న పరిస్థితి ఏర్పడినట్టు చెబుతున్నారు.

రైల్వే ఆసుపత్రిలో గ్యాంగ్‌మ్యాన్లకు చికిత్స

ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో ఇద్దరు గ్యాంగ్‌మ్యాన్లకు తీవ్ర గాయాలవగా వారు విశాఖ రైల్వే ఆసుపత్రిలో చేరారు. మర్రిపాలెం రైల్వేక్వార్టర్స్‌కు చెందిన పంచాది శ్రీనివాసరావుకు ఈ ప్రమాదంలో వెన్నుపూసపై బలమైన దెబ్బతగిలింది. గోపాలపట్నం సమీపంలోని కొత్తపాలెంలో నివాసముంటున్న మరో గ్యాంగ్‌మ్యాన్ బొడ్డేపల్లి తేజేశ్వరరావు ముక్కుకు తీవ్రంగా గాయమైంది. వీరిద్దరిదీ శ్రీకాకుళం. సోమవారం వీరిద్దరికీ సెలవు అయినందున రాయగడ పాసింజర్‌లో ఆదివారం శ్రీకాకుళం బయల్దేరారు. ఈలోగా ఏడు గంటల సమయంలో రాయగడ నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్ రైలు గట్టిగా ఢీకొనడంతో వీరూ గాయాలపాలయ్యారు.

'ఏం జరుగుతుందో అర్థం కాలేదు'

సరిగ్గా 6.50 నిమిషాల సమయంలో పెద్ద శబ్దం వచ్చిందని, తాము ప్రయాణిస్తున్న బోగీలు తీవ్రస్థాయిలో కదిలిపోవడంతో భయాందోళనకు గురయ్యామని, చాలా మంది పాసింజర్లు హాహాకారాలు చేశారని శ్రీనివాసరావు, బొడ్డేపల్లి తేజేశ్వరరావు 'ప్రజాశక్తి' ఎదుట తెలిపారు. 'మేము కూడా ప్రాణ భయంతో బిక్కుబిక్కుమంటూ ఒక మూలన పడిపోయాం' అని అక్కడి ఘోర సంఘటనను విడమర్చి చెప్పారు. తొలుత ఏం జరిగిందో తమకు అర్థం కాలేదని, గాయాలతో బయటపడి ఆసుపత్రిలో చేరామని అన్నారు. లోకోపైలెట్ సిగ్నల్‌ను సరిగా చూడకపోవడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పలువురు మాట్లాడుకోవడం విన్నామని చెప్పారు.


కెజిహెచ్‌లో క్షతగాత్రులు

రైలు ప్రమాదంలో గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం విశాఖకు తరలించారు. వీరిలో శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన రైల్వే గార్డ్ మరిటి శ్రీనివాసరావు (53) మార్గం మధ్యలో అర్ధరాత్రి వేళ మృతిచెందాడు. ఆయన మృతదేహానికి విశాఖ కెజిహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో విజయనగరం జిల్లా జామికి చెందిన నల్ల కుమారి, విశాఖపట్నం జిల్లా గాజువాకకు చెందిన ఎం.లక్ష్మి, శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం.వరలక్ష్మి, గొట్ట కమలమ్మ ఉన్నారు. వీరందరికీ ఆర్థోపెడిక్ వార్డులో చికిత్స అందిస్తున్నారు.

జ్యుడిషియల్ విచారణ జరపాలి : సిపిఐ

రైలు ప్రమాద ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్ గురజాడ జంక్షన్ వద్ద రైలు ప్రమాద మృతులకు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఎ.విమల, రెహమాన్ పాల్గొన్నారు. న్యాయవిచారణ జరపాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర కన్వీనర్ టి.శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

సందడిగా ఉపేంద్రగాడి అడ్డా ట్రైలర్ లాంచ్



మాట్లాడుతున్న బ్రహ్మానందం

ఎన్నో కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. కార్యక్రమంలో నిర్మాత కంచర్ల అచ్యుతరావు, చిత్ర హీరోయిన్ సావిత్రి కృష్ణ, కంచర్ల చిత్ర దర్శకుడు యాద్ కుమార్, దర్శకుడు విజయ్, 1920 భీమునిపట్నం దర్శకుడు నరసింహా నంది, హీరోయిన్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. సోమవారం ఆమె మూడో జోన్ పరిధిలో 16, 18, 19 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు వైసిపి తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, పార్లమెంటు సభ్యులు ఎంవివి.సత్యనారాయణ, ఆయా వార్డు కార్పొరేటర్లు మొల్లి లక్ష్మి, అప్పారావు, నొల్లి నూకరత్నంలతో కలిసి శంకుస్థాపన చేశారు. వీటిలో రక్షణ గోడ, శ్మశాన వాటిక, సిసి రోడ్లు పనులు ఉన్నాయి. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోర్టులో విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీలో విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు జరుగుతున్నట్లు పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఏటా విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈమారు 'సే నో టూ కరప్షన్ - కమిట్ టు ది నేషన్' థీమ్‌తో వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. వారోత్సవాల్లో భాగంగా పోర్టులోని పరిపాలనా కార్యాలయ భవనంలో సమగ్రతపై పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె పాల్గొన్నారు.

టిడిఆర్‌ల కుంభకోణంపై సమావేశం నిర్వహించండి

మేయర్‌కు సిపిఎం కార్పొరేటర్ గంగారావు లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్)ల్లో రోజుకొక కుంభకోణం వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో ఫ్లోర్ లీడర్లతో సమావేశం నిర్వహించాలని సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు ఉక్కునగరం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి లేఖ రాశారు. నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ ఒత్తిళ్లతో రెండు సంవత్సరాల్లో వేల కోట్ల విలువ చేసే టిడిఆర్‌లను జివిఎంసి విడుదల చేసినట్లు తెలుస్తోందన్నారు. మధురవాడలో పదేళ్ల క్రితం జాతీయ రహదారి నుంచి రేవళ్లపాలెం మీదుగా నవోదయ స్కూల్ వైపు వేసిన రోడ్డు విస్తరణలో భూమి పోయిందని గత నెలలో సుమారు రూ.206 కోట్లు విలువ చేసే టిడిఆర్‌లను జోగి జగన్నాథ వర్మ అనే వ్యక్తికి ఇచ్చారని తెలిపారు. గతంలో సిరిపురం వద్ద రోడ్డు విస్తరణ పేర సిబిఐఎన్‌సి సంస్థకు చెందిన వ్యక్తులకు రూ.63 కోట్లు టిడిఆర్‌లు ఇచ్చారన్నారు. దీని వెనుక అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల హస్తం ఉన్నట్లు తెలుస్తోందన్నారు. వీరి కోసం రోడ్ రీ డెవలప్‌మెంట్ అనే అక్రమ ప్రతిపాదన ముందుకు తీసుకొచ్చారని తెలిపారు.

ఇటీవల పెదవాల్తేరు దగ్గరలో వున్న పెదజాలారిపేటపై ఒక ప్రైవేట్ వ్యక్తి ఆ స్థలం నాదని చెబుతూ రూ.2800 కోట్లు టిడిఆర్‌ల కోసం జివిఎంసికి దరఖాస్తు చేసుకున్నారని, మరొక వ్యక్తి సీతమ్మధార వద్ద ఉన్న బిలాల్ కాలనీ మురికివాడ స్థలం నాదని, దానికి రూ.1000 కోట్లు టిడిఆర్‌లు ఇవ్వాలని జివిఎంసికి దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందేనన్నారు. ఈ క్రమంలో ఈ నెల 19న జరిగిన కౌన్సిల్ సమావేశంలో అజెండాగా పెట్టి బిలాల్ కాలనీని మురికివాడగా నోటిపై చేశారన్నారు.

సర్క్యూట్ హౌస్ వద్ద దసపల్లా భూముల్లో రోడ్డు నిర్మాణం పేర రూ.364 కోట్లు టిడిఆర్‌లు ఇవ్వడానికి నిర్ణయించారన్నారు. ఈ అక్రమాలన్నీ అధికార పార్టీ పెద్దల అండతో యధేచ్ఛగా సాగుతున్నాయని భావిస్తున్నామని తెలిపారు. అధికారులను సైతం లొంగదీసుకొని అవినీతికి పాల్పడుతూ వారి ఉద్యోగాలకే ముప్పు తెస్తున్నారన్నారు. వెలుగులోకి వచ్చిన కుంభకోణాలు కొన్ని మాత్రమేనని పేర్కొన్నారు. అక్రమ టిడిఆర్‌ల వల్ల జివిఎంసి ఖజానాకు వేల కోట్ల ఆదాయం నష్టం వాటిల్లుతున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో కౌన్సిల్‌లో చర్చకు పెట్టి రద్దు చేయాలని కోరారు.

భారీగా రైళ్ల రద్దు, దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజన్ మెయిన్ లైన్‌లోని కంటకాపల్లి - అలమండ మధ్య ప్యాసింజర్ రైలు ప్రమాదం కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. మరికొన్ని దారి మళ్లించబడ్డాయి. 08527 రాయ్‌పూర్-విశాఖపట్నం ప్యాసింజర్, 08528 విశాఖపట్నం- రాయ్‌పూర్ ప్యాసింజర్, 18517 కోర్బా-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 22809 పారదీప్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 08503 రాయగడ-విశాఖపట్నం, 08531 పలాస-విశాఖపట్నం, 08522 విశాఖపట్నం-గుణుపూర్, 08521 గుణుపూర్-విశాఖపట్నం, 07469 విజయనగరం - విశాఖపట్నం మెము ప్రత్యేక రైలు, 12718 విజయవాడ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 12717 విశాఖపట్నం - విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 17239 గుంటూరు-విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17267 కాకినాడ-విశాఖపట్నం మెము ఎక్స్‌ప్రెస్, 17268 విశాఖపట్నం - కాకినాడ మెము ఎక్స్‌ప్రెస్, 07466 రాజమండ్రి - విశాఖపట్నం మెము స్పెషల్, 07467 విశాఖపట్నం - రాజమండ్రి మెము స్పెషల్, 08545 కోరాపుట్-విశాఖపట్నం రైలు, 08546 విశాఖపట్నం - కోరాపుట్, 08531 పలాస-విశాఖపట్నం, 22819 భువనేశ్వర్-విశాఖపట్నం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, 22860 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ - పూరీ ఎక్స్‌ప్రెస్, 17244 రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్, 22820 విశాఖపట్నం-భువనేశ్వర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, 07470 విశాఖపట్నం-పలాస ప్యాసింజర్, 07471 పలాస-విశాఖపట్నం ప్యాసింజర్, 08583 విశాఖపట్నం - తిరుపతి, 18525 బ్రహ్మపూర్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 18526 విశాఖపట్నం-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్, 18512 విశాఖపట్నం-కోరాపుట్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, 08532 విశాఖపట్నం-పలాస ప్యాసింజర్ స్పెషల్, 08531 పలాస - విశాఖపట్నం ప్యాసింజర్ ప్రత్యేక రైలు, 08504 విశాఖపట్నం-రాయగడ ప్యాసింజర్ స్పెషల్, 07468 విశాఖపట్నం-విజయనగరం మెము స్పెషల్, 12839 హౌరా - ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ మెయిల్, 20810 నాందేడ్ - సంబల్‌పూర్ నాగావళి ఎక్స్‌ప్రెస్‌లను 30వ తేదీన రద్దు చేశారు. అదేవిధంగా 17240 విశాఖపట్నం - గుంటూరు - ఎక్స్‌ప్రెస్, 08584 తిరుపతి-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 18511 కోరాపుట్-విశాఖపట్నం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, 08503 రాయగడ -విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్, 07469 విజయనగరం - విశాఖపట్నం మెము స్పెషల్, 17480 తిరుపతి-పూరీ ఎక్స్‌ప్రెస్, 08531 పలాస - విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్‌ను 31న రద్దు చేశారు. ఇవికాక మరో పది రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

దారి మళ్లించబడిన రైళ్లు

అక్టోబర్ 28, 29, 30 తేదీలలో ఇప్పటికే బయలుదేరిన రైళ్లను దారి మళ్లించారు. 03357 బరౌని-కోయంబత్తూరు స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 18189 టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్, 11020 భువనేశ్వర్- సిఎస్‌టి ముంబై- కోణార్క్ ఎక్స్‌ప్రెస్, 12703 హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, 12245 హౌరా-ఎస్‌ఎంవి బెంగుళూరు దురంతో ఎక్స్‌ప్రెస్‌లను సాధారణ మార్గమైన విశాఖపట్నం, విజయవాడ మీదుగా కాకుండా టిట్లాగఢ్-రాయ్‌పూర్-నాగ్‌పూర్-బల్హర్షా-విజయవాడ మార్గంలో మళ్లించారు. 22852 మంగళూరు సెంట్రల్-సంత్రగచ్చి ఎక్స్‌ప్రెస్, 12246 ఎస్‌ఎంవి బెంగళూరు - హౌరా దురంతో ఎక్స్‌ప్రెస్, 20890 తిరుపతి-హౌరా ఎక్స్‌ప్రెస్, 12704 సికింద్రాబాద్ - హౌరా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, 12864 ఎస్‌ఎంవి బెంగుళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్, 22305 ఎస్‌ఎంవి బెంగళూరు-జాసిదిహ్ ఎక్స్‌ప్రెస్, 22503 కన్యాకుమారి-ఎస్‌ఎంవి బెంగళూరు, 12840 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-హౌరా మెయిల్, 18048 వాస్కోడిగామా-షాలిమార్‌లను విజయవాడ-నాగ్‌పూర్-రాయ్‌పూర్-జార్సుగూడ-ఖరగ్‌పూర్ మీదుగా దారి మళ్లించారు. 22808 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి, 18046 హైదరాబాద్-షాలిమార్ ఎక్స్‌ప్రెస్, 22641 త్రివేండ్రం సెంట్రల్- షాలిమార్ ఎక్స్‌ప్రెస్, 12842 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్- షాలిమార్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లను విజయవాడ-నాగ్‌పూర్-రాయ్‌పూర్-జార్సుగూడ-ఖరగ్‌పూర్ మీదుగా మళ్లించారు. 12504 అగర్తల-ఎస్‌ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్, 18045 షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 22855 సంత్రాగచ్చి-తిరుపతి ఎక్స్‌ప్రెస్, 12841 షాలిమార్-ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లను విజయనగరం-టిట్లాగఢ్-రాయ్‌పూర్-నాగ్‌పూర్-ఖాజీపేట-విజయవాడ మీదుగా దారి మళ్లించారు. 13351 ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్, 12835 హటియా-ఎస్‌ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌లను ఝార్సుగూడ- రాయ్‌పూర్-నాగ్‌పూర్-కాజీపేట-విజయవాడ మీదుగా దారి మళ్లించారు.

యోగా పోటీల్లో కోన అభినవ్ జోసెఫ్ ప్రతిభ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యోగా అసోసియేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ యోగా, ఆంధ్రా యూనివర్సిటీ సంయుక్తంగా విశాఖపట్నంలోని యోగా విలేజ్‌లో ఆదివారం ఉత్తర కోస్తా జిల్లాల యోగా పోటీలు నిర్వహించాయి. వీటిలో మొత్తం 14 జిల్లాల నుంచి వివిధ కేటగిరీల్లో వెయ్యి మంది పాల్గొన్నారు. 11-14 సంవత్సరాల కేటగిరీలో కోన అభినవ్ జోసెఫ్ ప్రథమ స్థానంలో నిలిచాడు. ముఖ్య అతిథులు యోగానంద భారతి స్వామీజీ, ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పివిజిడి.ప్రసాద్ రెడ్డి ఆయనకు బహుమతి అందించారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సభ్యునిగా ఉన్న అభినవ్ జోసెఫ్‌కు కన్వీనర్ కె.సుశీల అభినందనలు తెలియజేశారు.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించడంతోపాటు దేశంలో మూతబడిన పరిశ్రమలను తెరిపించడం ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ 104 వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్ శ్రీనివాస్‌నగర్ ఆటో స్టాండ్ వద్ద అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు, చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రైవేటు బడా కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతోందని మండిపడ్డారు ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద మాట్లాడుతూ ఆటో,మోటార్ కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని, భారీగా పెంచిన డీజిల్, పెట్రోలు ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గించాలని, మోటారు వాహనాలపై జారీ చేసిన జిఒ.21,31తోపాటు ఆటోలపై పెండింగ్‌లో ఉన్న ఇచలానాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో రావి కృష్ణ, కాంగ్రెసుల రాము, వై.వెంకట్, కేలం శివ హెచ్ శేఖర్, జై గణేష్ కుమార్, ఎ.శంకర్, కోటి, ఈశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి - ఆరిలోవ :విశాఖ పోర్టు సిటీ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది మహిళలకు సోమవారం. ఆరిలోవ తోట బిఎన్ఆర్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సర్టిఫికేట్లు అందజేసారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ బిఎన్ఆర్ నగర్‌లో 10 కుట్టు మిషన్లతో మహిళలకు శిక్షణతోపాటు విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ, ట్యూషన్ సెంటర్‌లు, లైబ్రరీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు ఆర్.రామకృష్ణా రావు, ఎన్ఎస్ఎన్ రాజు, డివివి.వర్మ, కెవి.రమణ, బిఎన్ఆర్ నగర్ సంఘం నాయకులు వి.నరేంద్రకుమార్, డి.నాగరాజు, ఎస్.గౌరమ్మ, సన్యాసమ్మ పాల్గొన్నారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రధాన పంటలతోపాటు అంతర పంటలు, కంచె పంటలు వేయడం వలన అదనపు దిగుబడి, ఆదాయం పొందవచ్చని రైతు కృష్ణవేణి అన్నారు. సోమవారం తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో మహిళారైతు కృష్ణవేణి తన పొలంలో పండించిన వేరుశెనగ పంటకోత ప్రయోగాన్ని వ్యవసాయశాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగువిధానం వల్ల తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. వీటికి అదనంగా కంచె, అంతర పంటలు వేసే మరింత ప్రయోజనకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రైనింగ్ అండ్ ట్రాన్సఫర్మేషన్ నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ అనురాధ, యూనిట్ ఇన్‌ఛార్జి రామారావు, ఐసిఆర్‌పి రైతులు పాల్గొన్నారు

ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

ప్రజాశక్తి -పద్మనాభం : మాతృవియోగం పొందిన మండలంలోని శేరికండం గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు వాడపల్లి ఆంజనేయులు, వాడపల్లి కృష్ణారావులను ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పరామర్శించారు. సోమవారం శేరికండంలో నిర్వహించిన పెద్దకర్మలో పాల్గొన్నారు. ఉపాధ్యాయుల తండ్రి రామారావు ఈ ఏడాది మే నెలలో మృతి చెందగా, వారి తల్లి సత్యవతి ఈనెల 19న సాధారణ మరణం పొందారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన పెద్దకర్మ, సంతాపసభలో పాల్గొని వారికి సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కె.దామోదరరావు, సర్పంచ్ చిన్నారావు పాల్గొన్నారు,

క్షతగాత్రులకు టిడిపి నేతల పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, తదితరులు

ప్రజాశక్తి -భీమునిపట్నం :విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో తీవ్రగాయాలతో విశాఖ నగరంలోని రైల్వే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు సోమవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి, వైద్యం అందుతున్న తీరును అక్కడున్న వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

గోపాలపట్నం : కొత్తవలస రైలు ప్రమాదం సంఘటనలో గాయపడి రైల్వే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆదివారం రాత్రి పరామర్శించారు. 89వ వార్డు సంతోష్ నగర్‌కు చెందిన బొడ్డుపల్లి తేజేశ్వరరావు మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్ చెందిన పి. శ్రీనివాసరావు చికిత్స పొందుతున్నారు. వీరితోపాటు ప్రమాదంలో మరణించిన రైల్వే గార్డు ఎం .శ్రీనివాసరావు కుటుంబసభ్యుల్ని కూడా రైల్వే హాస్పిటల్‌లో పరామర్శించారు.

కలెక్టరేట్ : రైలు ప్రమాదంలో గాయపడి కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సోమవారం సాయంత్రం టిడిపి నేతలు పరామర్శించారు. మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు, టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి నజీర్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఎంవిపి.కాలనీ : రైలు ప్రమాదంలో మరణించిన వారికి విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు అధ్వర్యంలో శివాజీపాలెం వద్ద నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి విశాఖ పార్లమెంట్ ఇన్‌ఛార్జి శ్రీభరత్, నాయకులు చోడే వెంకట పట్టాభి రామ్, బైరెడ్డి పోతన్న రెడ్డి పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత



సిసి రోడ్లుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల

ప్రజాశక్తి -గాజువాక : కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సోమవారం 67వ వార్డు పరిధిలో తొమ్మిది చోట్ల సిసి రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ వార్డులో కొండవాలు ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయని,దాన్ని దృష్టిలో పెట్టుకొని ఎక్కువ నిధులు కేటాయించినట్లు తెలిపారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గాజువాక నియోజవర్గంలో అన్ని జంక్షన్లను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని కణితి రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ పల్లా చిన్నతల్లి, డిఇఇ ఎంఆర్ఎఫ్ అప్పారావు, ఎఇ వెంకటరావు పాల్గొన్నారు.

'సర్వీస్ నౌ'తో గీతం అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : ప్రపంచంలోని ఫార్చ్యూన్ 500 కంపెనీలలో ఒకటైన అమెరికాకు చెందిన టెక్నాలజీ కంపెనీ సర్వీస్ నౌతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సోమవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, సర్వీస్ నౌ సంస్థ వర్క్‌ఫోర్స్ డెవలప్‌మెంట్ డైరక్టర్ జి.భాస్కర్ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా గీతం ప్రో వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ విద్యాలయాలతో పరిశ్రమలకు మెరుగైన సంబంధాల ద్వారా కాలానుగుణంగా సిలబస్‌లలో మార్పులతో విద్యార్థులు కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవడానికి ఈ తరహా ఒప్పందాలు దోహదపడతాయన్నారు. సర్వీస్ నౌ సహకారంతో గీతం విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా ఉపాది అవకాశాలు మెరుగు పరుచుకోవాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ సర్వీస్ నౌ సహకారంతో గీతం అధ్యాపకులు సమకాలీనా అంశాలపై శిక్షణ పూర్తిచేసుకున్నారని తెలిపారు. సర్వీస్ నౌ సంస్థ వర్క్‌ఫోర్స్ డవలప్‌మెంట్ డైరక్టర్ జి.భాస్కర్ మాట్లాడుతూ విద్యాలయాలు ఐటి రంగానికి తగిన నైపుణ్యాలతో విద్యార్థులను అందించడానికి, సిలబస్‌లలో మార్పులకు తాము సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో గీతం జిసిజిసి డీన్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్, డీన్ ప్రొఫెసర్ సిహెచ్ విజయశేఖర్, ప్రొఫెసర్ బసవరాజు, గీతం సిఎస్ఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ శిరీష పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల్లో ఎయు తెలుగు విభాగం విద్యార్థులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : వచ్చేనెలలో ఆంధ్రవిశ్వకళాపరిషత్‌ను న్యాక్ బృందం సందర్శిస్తున్న తరుణంలో వివిధ విభాగాలు కొత్తకళను సంతరించుకుంటున్నాయి. ఈ క్రమంలో తెలుగు విభాగం స్నాతకోత్తర విద్యార్థులు ఆ విభాగాన్ని రంగురంగుల ముగ్గులతో తెలుగుదనం ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. అదే విధంగా స్వచ్ఛభారత్‌లో భాగంగా తెలుగు విభాగం తోటలోని పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక వారసత్వాన్ని సమాజానికందించే శక్తిగా మారుతున్నారన్నారు. కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కట్టెపోగు రత్నశేఖర్, డాక్టర్ పెండ్యాల లావణ్య, విద్యార్థులు మధుబాబు, శ్రావణి, దేవి, నవ్య, రాణాప్రతాప్, పూర్ణ, కార్తీష్ , ఆలేఖ్యారాణి, నాగరాజు, సందీప్ కుమార్, వీరన్నపాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వీడిన మిస్టరీ!

- కన్నబిడ్డను కర్కశంగా హత్య

- ప్రియుడి మోజులో కన్నతల్లి దారుణం

ప్రజాశక్తి -గాజువాక : నీటి సంపులో ఐదేళ్ల బాలుడి హత్య మిస్టరీ వీడింది. ప్రియుడి మోజులో కన్నతల్లే మేగుబంధాన్ని కాటేసిందని పోలీసుల విచారణలో తేటతెల్లమైంది. ఘటనకు సంబంధించి మృతుని తల్లి దూది మణి, ఆమె ప్రియుడు పనస కుమార్‌లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఈనెల 25న జరిగిన దారుణ ఘటనకు సంబంధించి సోమవారం రాత్రి గాజువాక సిఐ భాస్కరరావు వెల్లడించిన వివరాలివి.

గాజువాక పంతులుగారి మేడ ప్రాంతంలో ఒక అపార్ట్‌మెంట్‌లో దూది దొరబాబు, అతని భార్య మణితోపాటు ఇద్దరు పిల్లలు శంకర్, వేదాంత జీవనం సాగిస్తున్నారు. విలాసాలకు అలవాటుపడిన మణి, కాకినాడకు చెందిన పనస కుమార్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. మణిని పెళ్లిచేసుకుంటానని నమ్మబలికిన కుమార్, పిల్లల అడ్డు ఉండకూడదంటూ షరతు పెట్టాడు. దీంతో కన్నతల్లి మణి వద్ద ఎక్కువ చనువుగా ఉండే ఐదేళ్ల కొడుకు వేదాంత అడ్డుగా ఉండడంతో అతని తొలగించుకోవాలని నిశ్చయించుకుని, నీటిసంపులో పడేసి పరారైంది.ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టి, మణిని పట్టుకుని తమదైన రీతిలో విచారించగా అసలు నేరాన్ని ఒప్పుకుందని సిఐ వెల్లడించారు. దీంతో నిందితురాలు మణితో పాటు ఆమె ప్రియుడు కుమార్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు.

కాలిన గాయాలతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ బీచ్ రోడ్డు కొబ్బరితోట పార్క్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి కాలిన గాయాలతో మృతి చెందాడు. సిఐ రమేష్ కథనం ప్రకారం, అందిన సమాచారం మేరకు సోమవారం సంఘటనాస్థలికి వెళ్లి పరిశీలించగా, సుమారు 40ఏళ్ల చామనఛాయ రంగులో గుర్తు తెలియని వ్యక్తి శరీరంపై కాలిన గాయాలతో పడిఉన్నాడని, చేతికి సెలైన్ బాటిల్ ఎక్కించిన ఆనవాళ్లు ఉన్నాయన్నారు.ఒడిశా వాసిగా అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మంత్రి రాజశేఖర్‌కు మాతృవియోగం



సత్యవతి (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి- గాజువాక : ఐఎన్‌టియుసి జాతీయ నాయకులు, వైసిపి నేత మంత్రి రాజశేఖర్ తల్లి మంత్రి సత్యవతి (85) సోమవారం ఉదయం మృతి చెందారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆ మె నడుపూరులోని స్వగృహంలో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, సిఐటియు నాయకులు ఎన్ రామారావు, జె.అయోధ్యరాము, ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు తదితరులు రాజశేఖర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు.

స్పందనకు రెండు అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన స్పందనలో రెండు అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ విభాగానికి సంబంధించి చెరొక అర్జీ వచ్చింది. సంబంధిత అర్జీలను తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత విభాగాల అధికారులకు పంపించినట్లు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు

ఢిల్లీకి డిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ నెల 30,31 తేదీల్లో ఢిల్లీలో జరిగే 'నా మట్టి నా దేశం' పేరిట జాతీయస్థాయిలో నిర్వహించనున్న కార్యక్రమానికి స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులు సేకరించిన మట్టిని ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అమృత కలశంలో నింపుతారన్నారు. ఈమేరకు ఎంపికైన విద్యార్థులను కళాశాలలో అభినందించారు . కళాశాల ఆంగ్ల అధ్యాపకులు వై వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి స్పందన


రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ : జిమ్‌సర్ ఆసుపత్రి, గీతం దంత వైద్య శాల సౌజన్యంతో ఎన్‌టిఆర్ సేవా సమితి ట్రస్టు, ఎంవివిఎస్. మూర్తి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో 10వ వార్డు ఆదర్శనగర్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత దంత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు వైద్యశిబిరాన్ని పారంభించారు. ఆదర్శనగర్, రవీంద్రనగర్, ఇందిరానగర్, పాతడెయిరీఫారం పరిసర ప్రాంతాల ప్రజలు వచ్చి దంత పరీక్షలు చేయించుకున్నారు. వీటితో పాటు సాధారణ వైద్య పరీక్షలు, గర్భిణులకుఆరోగ్య పరీక్షలు, మహిళలు, శిశు ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు రోగులకు ఉచితంగా మందులు అందజేసారు.కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్, గాడు అప్పలనాయుడు పొత్రకండ ధర్మారావు, ముగడ రాజారావు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ స్కేటింగ్‌లో దినేష్ ప్రతిభ


దినేష్‌ను అభినందిస్తున్న విజయనిర్మల, తదితరులు

ప్రజాశక్తి -ఆనందపురం: అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ షర్ష్ విభాగంలో వెల్లంకి గ్రామానికి చెందిన విజయం స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి గొలగాని దినేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈనెల 23 నుండి 28 వరకు చైనాలో జరిగిన అంతర్జాతీయ రోలార్ స్కేటింగ్ పేయిర్స్ విభాగంలో దినేష్ రజత పతకం సాధించాడు. పది దేశాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా, భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన దినేష్ రజత పతకంతో మెరిసాడు.

ఇప్పటివరకు జిల్లాస్థాయిలో 50, జాతీయస్థాయిలో ఐదు బంగారు పతకాలను సాధించిన దినేష్, ఎనిమిదేళ్ల కష్టానికి ఇపుడు ప్రతిఫలం అందుకుంటున్నాడన్నారు.తన బిడ్డకు అంతర్జాతీయస్థాయిలో సిల్వర్ మెడల్ రావడంపై దినేష్ తండ్రి శ్రీనివాసరావు, ఇతర కుటుంబసభ్యులతోపాటు ఎపి కోచ్ చిట్టిబాబు, విజయం స్కూల్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి, స్కూల్ యజమాన్య ప్రతినిధులు ఆనందం వ్యక్తంచేస్తున్నాడు. దినేష్‌ను విఎంఆర్‌డిఎ చైర్మన్ అక్కరమాని విజయనిర్మల, మాజీ జెడ్‌పిటిసి బమ్మిడి ఉమ, మాజీ సర్పంచ్ బమ్మిడి సూర్యనారాయణ, తారక్, బొట్ట రామకృష్ణ అభినందించారు.

మార్షల్ ఆర్ట్సులో ప్రవీణ్ సత్తా

ప్రజాశక్తి -ఆనందపురం: స్కై మార్షల్ ఆర్ట్సుఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ఈనెల 22,23 తేదీల్లో నెల్లూరులో నిర్వహించిన బ్లాక్‌బెల్ట్ పోటీల్లో మధురవాడకు చెందిన పోతిన ప్రవీణ్ ఫస్ట్ డేన్ బ్లాక్ బెల్ట్ సాధించాడని శొంఠ్యాం గ్రామానికి చెందిన ముఖ్య శిక్షకుడు, విశాఖపట్నం జిల్లా స్కై స్పోర్ట్సు మార్షల్ ఆర్ట్సు అసోసియేషన్ సెక్రటరీ లెంక అప్పలరాము తెలిపారు. వచ్చేనెల 6 నుంచి 9వరకు గోవాలో జరగబోయే 37వ నేషనల్ గేమ్సులో స్కై మార్షల్ ఆర్ట్సు పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 8 మంది బాలురు. 8 మంది బాలికలు ఎంపికకాగా, విశాఖపట్నం జిల్లా నుంచి ప్రవీణ్ అర్హత సాధించగా, నెలరోజులపాటు నెల్లూరు సుబ్బారెడ్డి స్టేడియంలో స్కై ఫెడరేషన్ చైర్మన్ ఇస్మాయల్, సెక్రటరీ ఇబ్రహీం శిక్షణ పొందుతున్నాడు. తనలోని ప్రతిభను గుర్తించి మార్షల్ ఆర్ట్సు పోటీలను ఎంపికచేసిన కోచ్ అప్పలరాముకు అలాగే విశాఖపట్నం జిల్లా స్కైఅసోసియేషన్అధ్యక్షుడు ఆబోతు అప్పల రాము, వైస్ ప్రెసిడెంట్ బొడ్డపు బంగార్రాజు, టీమ్ మేనేజర్ గవర ఈశ్వరరావులకు ప్రవీణ్ ధన్యవాదాలు తెలిపాడు.

కొనసాగుతున్న 'ఉక్కు' దీక్షలు


దీక్షల్లో కూర్చున్న ఐద్వా నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం ద్వారా లక్ష మంది ఉపాధిపై మోడీ ప్రభుత్వం దాడికి పూనుకుందని, ఈ చర్యను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 940వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐద్వా కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆమె మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం.. లేదంటే మూసేస్తాం అని ప్రకటించటం దుర్మార్గమన్నారు. ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి దేశ వ్యాప్త మద్దతు దక్కుతోందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం జరిగిన పోరాటాలను గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఎ.పుష్పాంజలి సాహు, కె.సంతోషం, కె.అనురాధ, ఆర్.వరలక్ష్మి, కె.మణి, ఎల్.కామేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

ఉక్కు రక్షణలో పార్టీలకు చిత్తశుద్ధి కరువు

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో స్థానిక రాజకీయపార్టీలకు చిత్తశుద్ధి పూర్తిగా కొరవడిందని ఉక్కు పోరాట కమిటీ సభ్యులు వరసాల శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం కూర్మన్నపాలెం ఆర్చ్ వద్ద 991వ రోజు ఉక్కు రిలే దీక్షల్లో సింటర్ ప్లాంట్ కార్మికులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం కక్షగట్టిందని, ఉత్పత్తిని తగ్గించి, అమ్మకాలు లేకుండా చేసి, వేల కోట్లలో నష్టాలబాట పట్టేలా చేసి వందశాతం మూసేందుకు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. అందుకే 991రోజులుగా కార్మికులు ఉద్యమిస్తున్నా కేంద్రానికి పట్టడం లేదన్నారు. ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ, మూసివేతకు కేంద్రం నిర్ణయిస్తే, అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం మెడలు వంచి కాపాడుకున్నాయని, కానీ మన రాష్ట్రంలో అధికార వైసిపితోపాటు ప్రధాన ప్రతిపక్షాలు కేంద్రం ముందు మోకరిల్లి, రాష్ట్రానికి, ప్రజలకు అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. దీక్షల్లో కెవి భాస్కర్, జె వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాస్, లంకా లక్ష్మీ ప్రసన్నకుమార్, డిఎస్.ఆర్. మూర్తి, కర్రి బాబురావు, వరుణ్, లక్ష్మణ్, పిఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

సిఎస్ఇ అకాడమీతో రఘు కాలేజీ ఎంఒయు


ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి -తగరపువలస : భారత ప్రభుత్వ సంస్థ మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సిఎస్‌సి అకాడమీతో, భీమిలి మండలం, దాకమర్రి రఘు ఇంజనీరింగ్‌కళాశాల సోమవారం అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు రఘు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు కళాశాల ప్రాంగణంలో జరిగిన పరస్పరం ఒప్పందపత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. ఎస్‌సి, ఎస్‌టి విభాగానికి చెందిన యుజి అండ్ పిజి విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతికత, నైపుణ్యాభివృద్ధిపై బెంగళూర్ సిడిఎసి, ఐఇఇఇ సంస్థలు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సిఎస్‌సి అకాడమీ ప్రతినిధి వై రామ్మోహనరావు, ప్రిన్సిపల్ శ్రీనివాస్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి గడపగడపకూ...


పాలవలసలో గడపగడపలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రజల సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించడమే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంల ఉద్దేశ్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని పాలవలస గ్రామపంచాయతీ ఇంటింటా పర్యటించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. పాలవలస పంచాయతీలో అర్హులకు రూ.2.65కోట్ల విలువైన సంక్షేమ లబ్ధిని నేరుగా లబ్ధిదారులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అడపా లవరాజు , జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, భీమిలి ఎఎంసి డైరెక్టర్ రౌతు శ్రీను, పాలవలస ఎంపిటిసి రౌతు శ్యామల వెంకటరావు, సర్పంచ్ నాగోతి అచ్చియమ్మ నరసింహులు పాల్గొన్నారు.

సీతమ్మధార : 26వ వార్డు శాంతిపురం సచివాలయం పరిధిలోని అక్కయ్యపాలెం, సంకువానిపాలెం, రామక్రిష్ణ నగర్ ప్రాంతాల్లో గడపగడపకూ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, కెకె రాజు పాల్గొని, ఇంటింటికి వెళ్లి సంక్షేమ ఫలాలను వివరిస్తూ. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పైడి రమణ, పాండవ శ్రీను, బొడ్డేటి కిరణ్, అమర్‌రెడ్డి, రేవాతిరావు, నవాబ్, శేషు, అమ్మాజీ, ఎం.సునీల్, శ్యామల, హరికృష్ణ, బాబ్ జాన్, సుశీల, రమాదేవి, గౌస్య, విజయ్ పాల్, ఫరూక్, జి.లక్ష్మీ పాల్గొన్నారు.

ధర్మారావుకు సాహితీ విఖ్యాత కవితా పురస్కారం

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎన్‌జివోస్ కాలనీలోని జివిఎంసి పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎంవి.ధర్మారావుకు సాహితీ విఖ్యాత కవితా పురస్కారం దక్కింది. కరీంనగర్‌కు చెందిన ఆర్యాణి సకల కళావేదిక ఆద్వర్యంలో శ్రీగౌతమేశ్వర సాహితీ కళా సేవాసంస్థ ఈనెల15న అంతర్జాల వేదికగా నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి రికార్డ్ కవితల పోటీలో ధర్మారావు ఒక్కగంట వ్యవధిలో నాలుగు కవితలు రాయడం ద్వారా తనలోని సాహితీ ప్రతిభను చాటి పురస్కారానికి ఎంపికయ్యారు.కరీంనగర్ పట్టణంలో సంస్థ అధ్యక్షులు దూడపాక శ్రీధర్ నుంచి సాహితీ విఖ్యాత కవితా పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, విశ్లేషకులు, భవానీ సాహితీ కళావేదిక అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్ నుంచి స్వర్ణకంకణం గౌరవాన్ని పొందారు. గౌతమేశ్వర సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు దూడపాక శ్రీధర్, సంస్థ ప్రధాన సలహాదారు పోర్ల వేణుగోపాల్ దుశ్శాలువాతో ధర్మారావును సత్కరించారు.కార్యక్రమంలో కణిక సాహితీ ప్రక్రియ రూపకర్త రమాదేవి కొలకలూరి పాల్గొన్నారు. ధర్మారావుకు అవార్డు దక్కడంపై పాఠశాల హెచ్ఎం బి.లక్ష్మీసరస, సహోపాధ్యాయులు అభినందించారు.

బాక్సింగ్‌లో రఘుదర్శన్‌కు రజతం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఈ నెల 21 నుంచి 29వరకు ఢిల్లీలో బాక్సింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో నగరంలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ కాలేజీ బిఎ సెకెండియర్ విద్యార్థి సిహెచ్. రఘుదర్శన్ మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిల్లో రజత పతకాన్ని సాధించారు. స్థానిక కోచ్ అమోరు వద్ద శిక్షణ పొందుతున్న రఘుదర్శన్ రెండు ప్రయత్నాలలోనూ త్రుటిలో బంగారు పతకాన్ని చేజార్చుకుని రజత పతకంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిందని కోచ్ తెలిపారు. తర్వాత ప్రయత్నంలో తప్పకుండా బంగారు పతకాన్ని సాధిస్తానని రఘుదర్శన్ ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి బాక్సింగ్‌లో రజత పతకాన్ని సాధించిన రఘుదర్శన్‌ను కాలేజీ కరస్పాండెట్, ప్రిన్సిపల్, ఫిజికల్ డైరెక్టర్ వై.శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-సీతమ్మధార: ఆంధ్ర యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలు ఆంధ్ర యూనివర్సిటీలో ముగిసాయి. ఈ టోర్నమెంట్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా వర్సిటీ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన కాలేజీ విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి మధుకుమార్ అభినందించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ఎస్ లక్ష్మణ రెడ్డి ఉన్నారు.

న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం నుంచి అడివరం వరకు ఉన్న బిఆర్‌టిఎస్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం వార్డు కార్పొరేటర్ పివి.నరసింహం ఆధ్వర్యంలో కలెక్టరేట్ స్పందనలో వినతిపత్రం అందజేశారు. టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ నగర ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్ 98వ వార్డు టిడిపి అధ్యక్షులు పంచదార శ్రీనివాసరావులతో కలిసి, కలెక్టరేట్ స్పందనలో జెసి విశ్వనాథన్‌కు అర్జీ సమర్పించి న్యాయం చేయాలని కోరారు. పూర్తిగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రత్యామ్నాయం చూపాలని, బిఆర్‌టిఎస్‌లో నష్టపోయిన ఇళ్లు పునర్నిర్మాణానికి జివిఎంసి, దేవస్థానం అనుమతులు ఇప్పించాలని, రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సత్యారావు, బంధం సూరిబాబు, అధిక సంఖ్యలో బాధితులు పాల్గొన్నారు.

కొండవాలులో సౌకర్యాల కల్పనకు కృషి


కొండవాలు ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో సమస్యల పరిష్కారంతో పాటు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు అన్నారు. సోమవారం 47వ వార్డు కప్పరాడ కొండవాలు ప్రాంతంలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ప్రజల అభ్యర్థన మేరకు కొండవాలులో సిమెంట్ మెట్లు, సిసి డ్రైనేజీలు, కొత్త కరెంట్ స్తంభాలు, వీధివిద్యుత్ దీపాలు, ఇతర సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, జెసిఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, 47వ వార్డు వైసిపి నేతలు గురువాజీ, సుకుమార్, కృప, ,రాఘవులు, కనకరాజు, లక్ష్మణ్, సాయి, సురేష్, భోగి రమేష్, సుధాకర్, అనిల్, చందురెడ్డి, రమణ, జయకుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేసిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాలని ధర్నా

లేకుంటే ఆందోళన తీవ్ర తరం చేస్తాం : ల్యాండ్ పూలింగ్ నిర్వాసితులు



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ల్యాండ్ పూలింగ్ బాధితులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ల్యాండ్ పూలింగ్ నిర్వాసితులకు రెండు రోజుల్లో లోపు అధికారులు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేసిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని కోరుతూ భూ బాధితులు సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వీరికి ల్యాండ్ పూలింగ్ భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షులు గంటా శ్రీరామ్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, దళిత బహుజనుల సంఘం కన్వీనర్ కొల్లి సత్యారావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాసితుల సంఘం అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ కూండ్రం, కుంచంగి, విజె.పాలెం గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్‌లో భూమి కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. 48 రోజుల నుండి ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎకరాకు రూ.20వేలు చొప్పున సంవత్సరానికి పరిహారం అందించాలని, అన్ని రకాల నిర్వాసితులకు ఎకరానికి 36 సెంట్లు చొప్పున భూమి ఇవ్వాలని, ఉడా నిబంధనలు పాటించి వెంటనే ప్లాట్లను అభివృద్ధి చేసి, రిజిస్ట్రేషన్ చేసి అప్పగించాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటం తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ వేటజంగాలపాలెంలో సర్వే నెంబర్ 50లో ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతుల భూములు బలవంతంగా తీసుకోవద్దని హైకోర్టు రిట్ పిటిషన్ 64/2020 పిల్ ద్వారా గత ఏడాది మార్చి 11న తీర్పు ఇచ్చినా, రెవెన్యూ, ఉడా అధికారులు భూముల స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ హైకోర్టు తీర్పును ఉల్లంఘిస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలని కోరారు. ఎపి.దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కన్వీనర్ కొల్లి సత్యారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కె.కొండబాబు, కె.శ్రీనివాసరావు, ఆర్‌వి.కుమార్, జి.ఈశ్వరరావు, సిహెచ్.శంకరరావు, ఎం. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


ఆర్.శివరామపురంలో ఎండిన పంటను పరిశీలిస్తున్న టిడిపి నేతలు

రైతులను ఆదుకోవాలి


ప్రజాశక్తి- బుచ్చెయ్యపేట : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చోడవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రాజాం, ఆర్.శివరాంపురం గ్రామాల్లో ఎండిపోయిన వరి పంటలను టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు తమ బాధను తెలియజేశారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, పంట ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. అనంతరం తాతయ్యబాబు మాట్లాడుతూ ఒక్కో ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశారని, వర్షభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గోకవాడ కోటేశ్వరరావు, నాయకులు కోరుకొండ రవికుమార్, దేవర తాతాజీ, దొడ్డి కిషోర్, మరిసా సతీష్, గొన్నాబత్తుల శ్రీనివాసరావు, సిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, నర్సింగరావు, నమ్మి రాజు, ఎంపీటీసీ కంచిపాటి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.


పతకాలు అందిస్తున్న ముత్యాల వెంకటేశ్వరరావు

క్రీడాకారులకు ఎంవిఆర్ చేయూత

ప్రజాశక్తి- అనకాపల్లి : క్రీడాకారులకు ప్రముఖ వ్యాపారవేత్త, ముత్యాల గార్మెంట్స్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) సహాయం అందించారు. జిల్లాలోని చోడవరం నియోజకవర్గానికి చెందిన పతాంజలి యోగ సెంటర్ విద్యార్థులు జిల్లా యోగా సెంటర్ అధ్యక్షులు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా తరగతులలో ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపిక కాగా, వారికి ఎంవిఆర్ చేతుల మీదుగా పతకాలను, బహుమతులను సోమవారం నరసింగరావుపేట ఆయన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎంవిఆర్ మాట్లాడుతూ యోగా మన ప్రాచీన కాలం నుంచి అనాదిగా వస్తుందని, నిరంతరం యోగా చేయడం వలన మనలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. శరీరంలోని అన్ని అవయవాలు సక్రమంగా, శక్తివంతంగా పనిచేసేందుకు ఈ యోగాసనాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిఎన్ఎస్ బిల్లుపై జాతీయ వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

ప్రజాశక్తి- సబ్బవరం

భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) బిల్లు-2023పై స్థానిక దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీ, విశాఖ సెంటర్ ఫర్ క్రిమినల్ జస్టిస్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (సిసిజెఎ) ఆధ్వర్యాన ఈ నెల 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు జాతీయ వర్క్ షాప్ నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన వర్శిటీ వీసీ ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ భారతీయ శిక్షాస్మృతి (ఐపిసి) 1860 స్థానంలో భారత ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత బిల్లుపై చాలా చర్చ జరగవలసిన అవసరం ఉందని చెప్పారు. ఈ చట్టంలో ప్రతిపాదించిన అనేక అంశాలను సవివరంగా చర్చించేందుకు ఈ రెండురోజుల వర్క్‌షాప్ ఎంతగానో ఉపయోగపడినట్లు తెలిపారు. ముఖ్యంగా దేశద్రోహం, మాబ్-హించింగ్, టెర్రరిస్ట్ యాక్ట్, వ్యవస్థీకృత నేరాలు, క్రిమినల్ చట్టంలోని ముఖ్యమైన విభాగాలపైనా, బిఎన్ఎస్ బిల్లులో చేసిన మార్పులపైనా చర్చించారు. రిసోర్స్ పర్సన్స్, పార్టిసిపెంట్స్ మధ్య ఇంటరాక్టివ్, ఇన్ఫర్మేటివ్ ప్యానెల్ చర్చ జరిగింది. మొదటి రోజు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భువనేశ్వర్ కెఐఐటి స్కూల్ ఆఫ్ లా ప్రొఫెసర్ భవానీ ప్రసాద్ పాండా, రెండో రోజు ముఖ్య అతిథిగా ఢిల్లీ ఎన్ఎల్‌యు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ బాజ్‌పాయ్, రిసోర్స్ పర్సన్స్‌గా రిటైర్డ్ జడ్జి జి.వెంకట కృష్ణయ్య, డాక్టర్ కెవికె సంతి, ప్రొఫెసర్ జార్జ్ జోసెఫ్, మైలపిల్లి ఆదినారాయణ హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ జోగి నాయుడు, ప్రొఫెసర్ ఎ.అరుణశ్రీ లక్ష్మి, డాక్టర్ పి.వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.


అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

స్పందన అర్జీల పరిష్కారం వేగవంతం

ప్రజాశక్తి- అనకాపల్లి : కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, జెడ్‌పి సీఈవో పోలినాయుడు, సుజల స్రవంతి ఎస్డిసి కె.రమామణి ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. 445 దరఖాస్తులు, ఫిర్యాదులు వచ్చాయి. అర్జీలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గిరిజన యువత ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలు

ప్రజాశక్తి- అనకాపల్లి :గిరిజన యువత అభివృద్ధికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, హోం మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నవంబరు 2 నుంచి 8వ తేదీ వరకు 15వ గిరిజన యువత ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలు అచ్యుతాపురంలోని ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువకేంద్రం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా యువ అధికారి జి.మహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఒక రాష్ట్రంలో జీవనశైలి, అభివృద్ధి పరిస్థితులను మరో రాష్ట్రం వారు తెలుసుకోవాలనే ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో నవంబర్ 2 నుండి 8 వరకు జరుగు ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాలకు చెందిన తొమ్మిది జిల్లాల నుంచి 200 మంది గిరిజన యువతీయువకులు హాజరవుతారని తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో యువత జీవన వ్యవహార శైలి, ఆచార వ్యవహారాలు సంస్కృతి, సంప్రదాయాలు, భాషా సంప్రదాయాలు, నివసించు పద్ధతులు, ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, మహిళ, యువత సాధికారిత, మత, ప్రాంతీయ, తీవ్రవాదం, స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ సమైక్యతలో యువత పాత్ర, గిరిజన ప్రాంతాల సమస్యలు, ఉపాధి కల్పన, మేనేజ్‌మెంట్ స్కిల్స్, కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్, ఆర్గనైజేషన్ ఆఫ్ యూత్ పార్లమెంట్ వంటి వాటిపై చర్చ, వక్తృత్వం, గిరిజన సంప్రదాయ నాట్య పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎస్ఐజెడ్, బ్రాండిక్స్, స్టీల్‌ప్లాంటు, ఎన్టీపీసీ, ఎంఎస్ఎంఇ తదితర పారిశ్రామిక, కైలాసగిరి, సింహాచలం, రామకృష్ణ బీచ్, బొజ్జన కొండ తదితర పర్యాటక కేంద్రాలను గిరిజన యువత సందర్శిస్తుందని తెలిపారు.

అనకాపల్లిలో అవినీతికి ఆద్యుడు అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గంలో అవినీతి అక్రమాలకు ఆద్యుడు మంత్రి గుడివాడ అమర్నాథ్ అని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయకపోయినా యువతరాన్ని మోసగించడంలో అమర్నాథ్ తనను తానే సాటని పేర్కొన్నారు. చంద్రబాబుకు జైల్లోనే సురక్షితమని చెప్పడం అమర్నాథ్ నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీలో అవినీతి, విస్సన్నపేట భూముల్లో అవినీతి అక్రమాలు బయటపెట్టి అదే సిబిఐ చేత అమర్నాథ్‌పై కేసులు పెట్టించి రాజమండ్రి జైల్లో సురక్షితంగా భద్రత కల్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనకాపల్లిలోని టిడ్కో గృహాలను విశాఖ దక్షిణ నియోజకవర్గ ప్రజలకు కేటాయించినప్పుడు నోరు మెదపకుండా అక్కడి ప్రజల నోట్లో మట్టి కొట్టారని విమర్శించారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు మళ్ల శివన్నారాయణ, సూరే సతీష్, ధనాల విష్ణు చౌదరి, కొట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ వర్సిటీ పోటీలకు డైట్ విద్యార్థిని

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో మొదటి సంవత్సరం చదువుతున్న యు.జయశ్రీ నవంబర్ 6 నుంచి 9 వరకు రాజస్థాన్‌లో జరిగే సౌత్ వెస్ట్ జోన్ తైక్వాండో నేషనల్ టోర్నమెంట్ మహిళల విభాగంలో ఎంపికయ్యారు. ఈమె జెఎన్‌టియు, జివి విశ్వవిద్యాలయం నుంచి పాల్గొంటున్నట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బిసిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. పోటీలకు ఎంపిక కావడం పట్ల కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ కె.పార్వతి, అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణనాగ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.


ఎంపికైన డైట్ విద్యార్థి జయశ్రీ

బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక న్యూ కాలనీ రోటరీ కళ్యాణ మండపంలో సోమవారం బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రెస్ట్ కేన్సర్‌పై డాక్టర్ మాట్లాడుతూ ఎస్టిక్ సిస్టం ఎక్కువ అవ్వడం వల్ల అనకాపల్లిలో కేన్సర్ ప్రబలుతోందని, జిల్లాలో ఎక్కువగా కేన్సర్ పేషెంట్లు పెరుగుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ప్రతి ఒక్కరూ టెస్టు చేయించుకుని కేన్సర్ రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ అనకాపల్లి జిల్లా 32 చార్టర్ 3016 చైర్మన్ జి శ్రీదేవి, డాక్టర్ రామ్మోహన్‌రావు, ఐఎస్‌ఓ జ్యోతి, స్థానిక ప్రెసిడెంట్ మంజు భార్గవి, మణి, పి బాంధవి, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ అనకాపల్లి అధ్యక్ష కార్యదర్శులు తాటికొండ రమా, శ్రీదేవి, మహిళలు పాల్గొన్నారు.


డాక్టర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

రూ.1.20 లక్షల నగదు, గృహోపకరణాలు అగ్నికి ఆహుతి

ప్రజాశక్తి-దేవరాపల్లి
మండలంలోని వాలాబు పంచాయతీ శివారు పాత వాలాబు గ్రామంలో గిరిజనుడు దిప్పల ఎరకన్నదొరకు చెందిన తాటాకు మిద్దిల్లు ఆదివారం రాత్రి చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైంది. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు. ఇటీవలే పొలం, వ్యవసాయ పశువులను అమ్మిన సొమ్ము లక్షా 20 వేల రూపాయలు ఇంట్లో పెట్టగా, ఆ మొత్తం అగ్నికి ఆహుతైనట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఇంట్లో సామాగ్రి మొత్తం కాలిపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. సంఘటన స్థలానికి స్థానిక ఆర్ఐ ఎన్.సతీష్ చేరుకొని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రమాద సమాచారం తెలుసుకున్న వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబూరావు, నాయకులు కర్రి సూరి నాయుడు, రొంగలి నారాయణమ్మ, పోడేల నాని తదితరులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాద వివరాలను తెలుసుకున్న వారు బాధిత కుటుంబానికి రూ.5000 నగదు, 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, దుస్తులు అందజేశారు. ప్రమాద విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయం అందేలా కృషి చేస్తానని అనురాధ చెప్పారు.


బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న వైసిపి నేతలు అనురాధ తదితరులు


మరమ్మతు పనులను పరిశీలిస్తున్న వైసిపి నేత రత్నాకర్

ఎస్‌సి బాలుర హాస్టల్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గాంధీనగరం ఎస్‌సి బాలుర హాస్టల్ భవనానికి వైసిపి అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ తన సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తున్నారు. హాస్టల్‌ను గతంలో దాడి రత్నాకర్ సందర్శించినప్పుడు హాస్టల్ మరమ్మతులు చేయాలని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ రేపాక మధు అభ్యర్థించగా, నాడు రత్నాకర్ తన సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు వారం రోజులుగా హాస్టల్ మరమ్మతులను చేయిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని గవరపాలెం జివిఎంసి పాఠశాలలో 1970 నుండి 1973 బ్యాచ్‌లకు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు స్థానిక నూకాలమ్మ దేవాలయం దగ్గర ఉన్న పట్టణ ఫైనాన్సియర్స్ సంక్షేమ సంఘం హాల్లో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుమారు 35 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు.కమిటీ అధ్యక్షునిగా బల్లా నాగభూషణం, గౌరవాధ్యక్షులుగా బొడ్డేడ అప్పారావు, కమిటీ చైర్మన్‌గా పిళ్ల శివ అప్పారావు, కార్యదర్శిగా దాడి శివరామకృష్ణ, ఉపాధ్యక్షులుగా రొబ్బి చంద్రరావు, సహాయ కార్యదర్శిగా పీలా వెంకట సత్యనారాయణ, కోశాధికారిగా పట్నాల కృష్ణ మోహన్, మరి కొంతమంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. శంకరంలోని బొజ్జన్న కొండ వద్ద డిశంబరు 17 ఆదివారం కమిటీ సభ్యులు కుటుంబాలతో కలిసి వన సమారాధన చేసుకోవాలని నిర్ణయించారు.

చెర్లోపల్లి గ్రోయిన్ పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాధ్ ఆదేశాల మేరకు అనకాపల్లి మండలం దిబ్బపాలెం ప్రాంతంలో శారదా నది దగ్గర ఉన్న చెర్లోపల్లి గ్రోయిన్ని విశాఖపట్నం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ త్రినాధరావు, డిఈ శ్రీచరణ్ సోమవారం సందర్శించారు. గ్రోయిన్ని పరిశీలించిన అనంతరం వారు అక్కడ ఉన్న రైతులతో మాట్లాడుతూ తక్షణమే ఈ ఖరీఫ్ సీజన్ పంటలకు నీరు అందించేలా మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ గ్రోయిన్‌కు పర్మినెంట్‌గా మరమ్మతులకు ఎంత ఖర్చు అవుతుందో ఎస్టిమేట్ వేసి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు దృష్టిలో పెట్టి మండల పరిషత్ నుండి నిధులు విడుదల చేసి మరమ్మతులు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, నాయకులు పెద్దాడ రామశంకర్, సిపిఐ జిల్లా నాయకులు వైఎన్ భద్రం, రైతు సంఘం నాయకులు కోరిబిల్లి శంకర్రావు, పీలా బుజ్జి, ఇరిగేషన్ సిబ్బంది, లక్ష్మీదేవిపేట, మల్లవీధి, కొట్నీవీధి, తుమ్మపాల ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో గౌరీ పరమేశ్వరులు ఆదివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపి గౌరీ పరమేశ్వరులను రామాలయం సమీపంలో ఉన్న కమ్యూనిటీ స్టేజ్ వద్ద ఏర్పాటు చేశారు. అనంతరం మహిళలంతా గౌరీ పరమేశ్వరుల పాటలు పాడారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సతీమణి రమణమ్మ, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, వేచలపు అప్పలనాయుడు, గొర్లెపోటు రమాదేవి, గాలి సూర్యలక్ష్మి, వేచలపు వాణి, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


కార్యక్రమంలో పాల్గొన్న కిలపర్తి భాస్కరరావు తదితరులు

కొత్తపేట హైస్కూల్‌కు క్రీడా పరికరాలు

ప్రజాశక్తి - యలమంచిలి : స్థానిక కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యాశాఖ సోమవారం క్రీడా పరికరాలు అందజేసింది. పాఠశాలలో చదువుతున్న 700 మంది విద్యార్థులకు అవసరమైన క్రీడల కిట్లు వాలీబాల్, త్రోబాల్, హేండ్‌బాల్, టెన్నికాయిట్, ఫుట్‌బాల్, చదరంగం, యోగా మేట్స్, షాట్‌పుట్, డిస్కస్ త్రో మొదలైన ఆటలకు చెందిన సామాగ్రిని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఆలమూరి శ్రీనివాసరావు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సిహెచ్.వెంకట్రావుకు అందజేశారు. విశాలమైన క్రీడా మైదానం ఉందని, ఈ పరికరాలు ఉపయోగించి విద్యార్థుల్ని మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. క్రీడోత్సవాలకు అవసరమైన సామాగ్రి అందజేసినందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.


క్రీడా పరికరాలు అందిస్తున్న ఇన్‌ఛార్జి హెచ్ఎం


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో యోగా సెంటర్ నిర్వాహకులు

యోగ పోటీల్లో శ్రీకృష్ణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ ఆంధ్ర యూనివర్సిటీలో ఈనెల 29న నిర్వహించిన ఉత్తర కోస్తా జిల్లాల యోగ పోటీలు-2023లో అనకాపల్లి జిల్లా తుమ్మపాల శ్రీకృష్ణ యోగ సెంటర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 55 కిలోల పైబడిన పురుషుల విభాగంలో బుదిరెడ్డి నరసింగరావు ప్రథమ స్థానం, 55 కిలోల పైబడిన మహిళల విభాగంలో బుదిరెడ్డి నాగమణి ప్రథమ స్థానాలు సాధించారు. 8 నుంచి 11 సంవత్సరాల బాలికల విభాగంలో బి.జయశ్రీ మూడవ స్థానం, 11 నుంచి 14 సంవత్సరాల బాలికల విభాగంలో 5వ స్థానాన్ని వి.వర్షిణి, 14 నుంచి 17 సంవత్సరాల బాలికల విభాగంలో బి.కీర్తన ఆరవ స్థానం సాధించారు. వారిని పలువురు అభినందించారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ అటానమస్ కళాశాలలో ఐ ట్రిపుల్ ఈ కోడింగ్ ఈవెంట్‌లో భాగంగా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సోమవారం ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ పూర్ణ ప్రియ, సిఎస్ విభాగాధిపతి డాక్టర్ కె.సుజాత చేతులమీదుగా ప్రశంసాపత్రం అందజేశారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ కృష్ణానాగ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ


గ్రామ చిత్ర పటానికి వేసి చూపుతున్న అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సోషల్ మ్యాపింగ్ ద్వారా పనుల గుర్తింపు, ప్రణాళిక ప్రక్రియ గ్రామసభ జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి గొర్లి సూరిబాబు మాట్లాడుతూ గ్రామంలో ఏయే పనులు గుర్తించి ఎలా చేయాలి, చెరువులు వాటర్ నిల్వ ఉండడానికి కొండల మీద ట్రెంచుల ఏర్పాటు, ప్రతి ఖాళీ ప్రదేశంలో పచ్చని మొక్కలను పెంచడానికి ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. వేసిన మొక్కలను కాపాడేందుకు ఒక మనిషిని పెట్టి వాటి సంరక్షణ బాధ్యతలు అప్పచెప్పాలన్నారు. గ్రామ చిత్రపటాన్ని వేసి వాటి వివరాలను ఏపీవో, ఎంపీపీ వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మి, సాలాపు శాంతి సూరిఅప్పారావు, ఎన్ఆర్ఇఎస్ ఏపీవో సుప్రియ, గ్రామ కార్యదర్శి గుణలక్ష్మి, వార్డు మెంబర్లు, ఓటీలు, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందే!

ప్రజాశక్తి-ఉక్కునగరం
రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు విద్యాశాఖ నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందేనని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. సోమవారంఉక్కునగరం ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌ను సందర్శించి, అమలౌతున్న బాలల హక్కుల పరిరక్షణ, విధి విధానాలపై ఆరా తీశారు. పాఠశాలపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు అందిన ఫిర్యాదులపై ఆరా తీశారు. పాఠశాలకు కొద్దిసేపు ఆలస్యమైనా, ఫీజుల చెల్లింపుల్లో కాస్త జాప్యమైనా యాజమాన్యం వహిస్తున్న కఠినవైఖరిపై అందిన ఫిర్యాదులపై విచారించారు. రెండో శనివారం, దసరా, ఇతరత్రా పండుగలకు, చివరకు వేసవి సెలవులను సైతం ప్రభుత్వం నిబంధన మేరకు అమలు చేయడం లేదన్న దానిపై విచారించారు. సీనియర్లు, చక్కని ప్రతిభ గల ఉపాధ్యాయులను ఇష్టానుసారంగా ఉద్యోగాల నుంచి తొలగించి, తక్కువ జీతాలకు సరైన అనుభవం లేని వారిని నియమిస్తున్న వైనంపైనా ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గుర్తింపు పొందిన పాఠశాల కావడంతో ప్రభుత్వ నియమనిబంధనలు తుచ తప్పకుండా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే క్రిమినల్ చర్యలకు బాధ్యులౌతారని హెచ్చరించారు. ఏ విద్యాసంస్థకూ నియమనిబంధనల్లో మినహాయింపు ఉండదన్న విషయాన్ని గుర్తించాలన్నారు. అతిక్రమిస్తే సుమోటోగా కేసులు స్వీకరించి చర్యలకు ఉపక్రమించబోమన్నారు. ఎంఇఒలు విశ్వనాథ్, సునీత, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నీలవేణి, సిడిపిఒ మమత, సిఐ శ్రీనివాసరావు, ఎస్.డిల్లీ, బి.సంతోష్‌కుమార్, పి.శేఖర్, స్కూల్ తల్లిదండ్రుల అసోసియేషన్ ప్రతినిధులు ఫణికుమార్, సత్యన్నారాయణ, జర్రిపోతుల మోహన్‌కుమార్, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా తుప్పలు

- ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డది-గౌరీపట్నం వెళ్ళు కస్పా రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, తుప్పలు ఏపుగా పెరిగాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు మార్గంలో ప్రతిరోజు వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ రోడ్డుకు ఇరువైపుల పిచ్చి తుప్పలు భారీగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు ఏ మాత్రం కనిపించకుండా ఉన్నాయి. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పలు మార్లు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి కస్పా రోడ్లో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.


కస్పా రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

హెటిరో పైప్‌లైన్‌తో మత్స్య సంపదకు గండం

మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



ధర్నాలో శ్రీనివాసరావు, అప్పలరాజు, మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : హెటిరో డ్రగ్స్ కంపెనీ కొత్త పైపులు ఏర్పాటు చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఏపీ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 693వ రోజుకు చేరింది. సోమవారం మత్స్యకారులు చేస్తున్న ధర్నాలో శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అప్పలరాజు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హెటిరో డ్రగ్స్ కంపెనీ సముద్ర తీరాన్ని డంపింగ్ యార్డ్‌గా మార్చి, పెద్ద రసాయన జలాలను సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద వృద్ధి చెందకుపోవడంతో మత్స్యకారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. 693 రోజుల నుండి మత్స్యకారులు సమస్య పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, అధికార యంత్రాంగం గాని సమస్య పరిష్కారానికి మార్గం చెప్పకపోవడం దారుణమన్నారు. పైపులైను పనులు చేపట్టడానికి కంపెనీ యాజమాన్యం ప్రయత్నిస్తుందని, కోర్టులో కేసు ఉండగా పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. నాయకులు కె.కాశీరావు, ఎం.శివాజీ, జీ.అంజి, ఎం.బాపూజీ, బి.తాతాజీ, సిహెచ్.గోపి, కె.భూలోక,పి.తాతాజీ, వి.శ్రీను పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న బూడి

బస్ యాత్ర ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-మాడుగుల: వైయస్సార్ పార్టీ నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమం జరిగే స్థలాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు పరిశీలించారు. మాడుగులకు సంబంధించి నవంబర్ 2న నిర్వహించనున్న సామాజిక సాధికార యాత్ర కార్యక్రమంలో భాగంగా మాడుగుల ఘాట్ రోడ్డు నుండి పాడేరు వెళ్ళే ఖాళీ స్థలంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సుమారు 30 వేల మంది హాజరయ్యే అవకాశం ఉందని నేతలు తెలిపారు. ఆయన వెంట ఎంపిపి రమధర్మాజ, నాయకులు రాజారాం, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

జగనన్న గృహాలకు అందుబాటులో ఇసుక



లారీలో తీసుకొచ్చిన ఇసుక

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలో నిర్మిస్తున్న జగనన్న గృహ లబ్ధిదారులకు సోమవారం నుంచి ఇసుకను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు మండల గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్ జగదీశ్వరరావు తెలిపారు. గతంలో నక్కపల్లి మండలం నుండి ఇసుకను తీసుకురావడంతో లబ్ధిదారులకు కాస్త ఇబ్బందిగా ఉండేదని, రవాణా చార్జీలు కూడా అధికంగా అయ్యేవన్నారు. ప్రస్తుతం నేరుగా మండలానికి రావడంతో లబ్ధిదారులకు కాస్త ఉపశమనం లభిస్తుందని తెలిపారు.

వరి పంటకు తెల్లరేకు తెగులు



ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని కొవ్వూరు గ్రామంలో వరి పంటకు తెల్ల రేకు తెగులు సోకింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాభావ పరిస్థితుల్లో ఏదో విధంగా రైతులు వరి పంటను కాపాడుకుంటూ వచ్చారు. ఈ తెగులుతో చేతి కందిన పంట ఆఖరి దశలో పాడైపోతుందని వాపోతున్నారు. వ్యవసాయాధికారులు తగు సూచనలు, సలహాలు అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు



పిఎం పాలెంలో పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్‌ఒ

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో గుడ్డిప గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 482 మంది రోగులకు వైద్యులు దుర్గాప్రసాద్, జి.నరేష్, సిహెచ్ రజిని, ఏవి రవికుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రావికమతం పిహెచ్సిసి వైద్యులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య శిబిరాల్లో క్వాలిఫైడ్ డాక్టర్స్‌తో వైద్య పరీక్షలు చేయించడం ఇదే మొదటిసారి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి గణేష్, రావికమతం కొత్తకోట పిఎస్సి వైద్య, సచివాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని సంపతిపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, ఎంపిపి గొర్లి సూరిబాబు ప్రారంభించారు. ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ గూన నాగరాజు, భీశెట్టి జగన్, పల్లా శ్రీనివాసరావు, రమణ, గోవింద, నాగేశ్వరరావు, ఎంపీడీవో, ఎంఈఓ, ఈఓపిఆర్డి, ఎసిడిపిఓ, స్పెషలిస్ట్ డాక్టర్లు, అంగన్వాడి సూపర్వైజర్లు పాల్గొన్నారు.

కరాస: జివిఎంసి 52వ వార్డు శాంతినగర్, కరాస సచివాలయం పరిధిలో శాంతినగర్ కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సందర్శించారు. నిపుణుల ఉచిత వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తగరపువలస : జివిఎంసి రెండో వార్డు ఆదర్శనగర్, వార్డు సచివాలయం-1 వద్ద సోమవారం జరిగిన ఆరోగ్య సురక్షలో 389 మందికి వైద్యపరీక్షలు చేశారు. ఇందులో 187మంది మహిళలు, 161మంది పురుషులుకాగా వారిలోపాఠశాల విద్యార్థులు 41మంది, గర్భిణులు నలుగురు ఉన్నారు. 61 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు, కంటి వెలుగు పథకంలో 40 మందికి కంటి అద్దాలను ఉచితంగా జెడ్‌సి బొడ్డేపల్లి రాము అందజేశారు. రోగులకు మందులతో కూడిన కిట్లు పంపిణీ చేశారు.

మధురవాడ: ఐదవ వార్డు, రాజీవ్‌గృహకల్ప పిహెచ్‌సిలో జనగన్న ఆరోగ్యసురక్ష శిబిరంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని, ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు, ఉచితంగా మందులు అందజేస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెరుగైన వైద్యసేవలు అవసరమైతే ఆరోగ్యశ్రీలో కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్‌సి కనకమహాలక్ష్మి, పోతిన హనుమంతరావు పాల్గొన్నారు.

పిఎం పాలెం : మధురవాడ ఎంఎన్‌ఆర్ లేఅవుట్, పి.ఎం.పాలెం, మారికవలస, మంగాపురం కాలనీలకు సంబంధించి యుపిహెచ్‌సిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని డిఎంహెచ్‌ఒ డాక్టర్ పి జగదీశ్వరరావు పరిశీలించారు. స్పెషలిస్ట్ వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరాల్లో డాక్టర్ బి.ఉమావతి, జిల్లా నోడల్‌అధికారి, బి.నాగభూషణంపాల్గొన్నారు.

6వవార్డు పిఎం పాలెం యుపిహెచ్‌సిలో ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ముత్తం శెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. అవంతి విద్యాసంస్థల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్, జెడ్‌సి కనక మహాలక్ష్మి, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాస్, వంకాయల మారుతి ప్రసాద్, పోతిన మూర్తి బాబు, గాదె రోషి రెడ్డి, పోతిన ప్రసాద్, పోతిన ఏళ్ళాజీ, పిల్లా రమణ, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, సియ్యాద్రి కనకరాజు, జగుపిల్ల నరేష్, మొజ్జాడ రమణ మూర్తి, కొండపల్లి వరలక్ష్మి, షేక్ జహనర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోటివేషన్ స్పీకర్ రజాక్

లక్ష్య సాధనకు విద్యార్థులు శ్రమించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: లక్ష్యసాధనకు విద్యార్థులు నిరంతరం శ్రమించాలని ప్రముఖ న్యాయవాది, మోటివేషన్ స్పీకర్ ఎమ్.ఎ.రజాక్ సూచించారు. సోమవారం మండలంలో పెదబోదుగల్లం హైస్కూలులో విద్యార్థులకు హెచ్‌ఎమ్ సి.హెచ్. సత్యనారాయణ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ, ఓటమి నుండి గెలుపు అనే అంశంపై విపులంగా విద్యార్థులకు వివరించారు. ఓటమి నుండి బయటపడడం, విజయంవైపు ప్రయాణించడంపై ఎన్నో ఉదాహరణలతో విద్యార్థులకు తెలియజేశారు .అసలు ప్రయత్నించక పోవడమే నిజమైన ఓటమన్నారు. వివేకానంద, అబ్దుల్ కలాం, ధోని, సచిన్ టెండూల్కర్, రతన్ టాటాల జీవితచరిత్రలో జరిగిన యదార్ధ ఘటనలను వివరించి, విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఎస్.ఫల్గుణరావు, ఎ.వి.ఎల్.ఎన్.కుమారి, రమేష్ బాబు, చిన్నారావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ల్యాప్‌టాప్‌ను ఇస్తున్న ట్రస్టు ఫౌండర్

విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: పట్టణంలో నారాయణ హైస్కూల్లో చదువుతున్న ఏడవ తరగతి విద్యార్థిని రుత్తల రోహిణికి అల్లాడ జగన్నాథరావు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అల్లాడ సురేష్ ప్రోత్సాహక బహుమతిగా ల్యాప్‌టాప్‌ను సోమవారం బహూకరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ నుండి ప్రతి ఏడాది ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతిగా అందించడం జరుగుతుందని కొనియాడారు. పేద విద్యార్థులను ప్రోత్సహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రతి ఏడాది లాప్టాప్ బహుకరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత పంచాడ హరినాథ్, జనసేన రూరల్ అధ్యక్షుడు ఊడి చక్రవర్తి, చిరంజీవి, సూర్యనారాయణ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

18న ఎంఆర్‌పిఎస్ చలో హైదరాబాద్

ప్రజాశక్తి-మాడుగుల: నవంబర్ 18న మందకృష్ణ మాదిగ నిర్వహిస్తున్న విశ్వరూప మహాసభకు చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. సోమవారం మండలంలోని ఎం కోడూరు గ్రామంలో మహాజన సోషలిస్ట్ పార్టీ సంఘం అధ్యక్షుడు కంటిపాము ఈశ్వరరావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్ట్ పార్టీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ ఏలుసూరి ఘాటీలు మాట్లాడుతూ, విశ్వరూప మహాసభకు అనేకమందిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల సహాయ కార్యదర్శి కండెల్ల శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

విభజన హామీల అమల్లో .. రాష్ట్రానికి బిజెపి ద్రోహం

-ప్రజారక్షణ భేరి సభను జయప్రదం చేయండి- సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-గొలుగొండ:అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం రూపొందించిన ప్రజా ప్రణాళిక అమలు కోసం పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పిలుపునిచ్చారు. సిపిఎం సమావేశం ఎస్సీ కాలనీ కమ్యూనిటీ భవనంలో సోమవారం సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, నవంబరు 15న ప్రజారక్షణ భేరి పేరుతో విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి ముందు మూడు ప్రాంతాల నుంచి బస్సు యాత్రలు బయలుదేరుతాయని, శ్రీకాకుళం జిల్లా మందస నుండి నవంబర్ 2న ప్రారంభమయ్యే బస్సు యాత్ర నవంబర్ 5న జిల్లాలో పర్యటిస్తుందని పేర్కొన్నారు. విభజన హామీలను అమలు చేయాల్సిన బిజెపి ప్రభుత్వం ఏ ఒక్కటి అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేస్తోందన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామాయపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, కడప ఉక్కు, రైల్వే జోన్ వంటి విభజన హామీలలో ఏ ఒక్కటీ అమలు కాలేదు. విశాఖ ఉక్కును తెగనమ్మడానికి తయారైందన్నారు. కోట్లాది మంది కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను తెచ్చిందని విమర్శించారు.ప్రజల ఆహార భద్రతకు ముప్పు తెచ్చే నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మరోసారి రైతన్నలకు ద్రోహం చేస్తోందని విమర్శించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి కార్పొరేట్ సేవలో తరిస్తున్నారని, విద్యుత్ చార్జీల పెనుభారం ప్రజలపై రుద్దుతున్నారన్నారు. మోటార్లకు మీటర్లు పేరుతో, ఆస్తి, చెత్త పన్నుల వడ్డింపులలో ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు.



మాట్లాడుతున్న లోకనాథం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ, అత్యధికంగా సాగులోనున్న గిరిజన, దళిత, బలహీన వర్గాల రైతులకు పట్టాలు ఇవ్వలేదన్నారు. గిరిజన గ్రామాలకు రోడ్లు లేవన్నారు.నర్సీపట్నంలో మినీ ఐటిడిఎ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీ ఉన్నా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులు ఉపాధి కల్పించాలని, స్థానిక పరిశ్రమల్లో రిజర్వేషన్లు అమలు చేసి స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి, మండల నాయకులు జి.శివ, లక్ష్మణరావు, పండు, రాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోటలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తానని వాహనదారులు, చిరు వ్యాపారులు సహకరించాలని కొత్తకోట ఎస్సై జి లక్ష్మణరావు కోరారు. సోమవారం కొత్తకోట మార్కెట్ యార్డులో స్థానిక శ్రీ శాంతి ఆటో యూనియన్ డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మణరావు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై సూచించారు. ప్రభుత్వం అందించే పథకాలు పొందాలన్నారు. స్థానికంగా ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు సతమతమ వుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. నిబంధనలు పాటించని వాహన దారులు పై కేసులు నమోదు చేస్తామన్నారు. ముందుగా ఆటో యూనియన్ అధ్యక్షులు బి. బుల్లిబాబు ట్రాఫిక్ సమస్య నివారణకు ఉదయం, సాయంత్రం సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరగా ఎస్సై స్పందించారు. ప్రతి రోజు ఓమ్ గార్డు ను ఏర్పాటు చేయడంతో పాటు వారానికి ఒక మారు స్థానిక ప్రజా ప్రతి నిధులతో కలిసి వ్యాపారులకు ట్రాఫిక్ పై ప్రత్యేక అవగాహన కల్పిస్తామని ఎస్సై లక్ష్మణ రావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో ఆటో యూనియన్ సభ్యులు శేఖర్, నాగు, సత్తిబాబు, నాయుడు, అప్పారావు, వెంకటరాజు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మత్స్యకారులు

పింఛన్ పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని అమలాపురం గ్రామానికి చెందిన చింతకాయల సింహాచలం, రాకాతి జగ్గారావు, వంకా తాతారావులు తమ పింఛన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సోమవారం అనకాపల్లి కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో పింఛన్ పునరుద్ధరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. తమకు గతంలో మత్స్యకార భరోసా పింఛన్‌ను ప్రతి నెల ఇచ్చే వారని, ఇటీవల ఎటువంటి కారణం లేకుండా పెన్షన్ ఇవ్వడం నిలుపుదల చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి నెల ఇచ్చే పెన్షన్ ఎందుకు నిలుపుదల చేసారో అర్థం కాలేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి పింఛన్ పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్తిబాబు పాల్గొన్నారు .

తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-రావికమతం:తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో తాగునీటి బోరును ఏర్పాటు చేయడం జరిగిందని తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లా డుతూ, గ్రామంలో కొంతమంది ప్రజలు సమస్యను తమ దృష్టికి తీసుకు రావడంతో తక్షణమే బోరు ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు.


ప్రారంభిస్తున్న సర్పంచ్

వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రోలుగుంట:ఆర్ల పంచాయతీ కొండశిఖర పాతలోసింగి గ్రామంలో తక్షణమే వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, కెవిపిఎస్ నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలోని పిటిజి కొండు తెగ ఆదివాసి గిరిజనులు గత వారం రోజుల నుంచి జ్వరాలతో బాధపడుతున్నారన్నారు. ఆసుపత్రులకు వెళ్లలేని స్థితిలో ఉన్నారని, తక్షణమే వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వారు కోరారు.

విద్యా సంస్థల బంద్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం నవంబర్ 8కి వెయ్యి రోజులకు చేరుకుంటున్న నేపథ్యంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ, కడప స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం నవంబర్ 8న విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యాన తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్ పోస్టర్‌ను సోమవారం విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్ఒ, ఎఐడిఎస్ఒ, పిడిఎస్‌యు, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్ సంయుక్తాధ్వర్యాన ఈ బంద్ జరగనుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పోరాటాన్ని నీరుగార్చే విధంగా వ్యవహరించడం దారుణమన్నారు. సుదీర్ఘకాలంగా కార్మికులు, ప్రజలు చేస్తున్న పోరాటాలను పట్టించుకోకుండా స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టే కుట్రలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కేంద్రంలోని బిజెపిని గద్దె దింగి స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామన్నారు. విద్యార్థులు, ప్రజలు, విద్యా సంస్థల యాజమాన్యాలు తాము చేపట్టిన బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రాజు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వై.రాంబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, ఎఐడిఎస్ఒ జిల్లా కార్యదర్శి అభిలాష్, పిడిఎస్ఒ జిల్లా కార్యదర్శి విశ్వనాథం, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి భానుశ్రీ పాల్గొన్నారు.


విద్యా సంస్థల బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు


హాజరైన అధికారులు, ప్రజలు

సమస్యలు తెలపాలి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సిహెచ్ నాగాపురం పంచాయతీ శివారు కుమారపురం గ్రామంలో సోమవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల ఎంపిపి గజ్జలపు మణికుమారి అధ్యక్షత వహించారు. దళితవాడల్లో మౌలిక వసతులు, తాగునీరు, రోడ్ల సదుపాయం, డ్రైనేజీ సమస్యలపై ఆయా అధికారులను తెలియజేయాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి చిట్ల చలపతిరావు మాట్లాడుతూ, అధికారులు సమస్యలపై వెంటనే స్పందించి దళితవాడల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.అప్పారావు ఆర్ఐ, పౌర హక్కులపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎలమంచిలి రఘురాం, ఎంపిడిఒ డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు అనిత


మాట్లాడుతున్న అనిత

ప్రజాశక్తి- నక్కపల్లి:జగన్ పాలనలో పగ ప్రతీకారం తప్ప అభివృద్ధి లేదని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత విమర్శించారు. .మండలంలోని క్రిష్ టౌన్ షిప్ ఆమె స్వగృహంలో సోమవారం నియోజవర్గ స్థాయి పార్టీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేశారన్నారు. హైదరాబాదులో ఐటీ విద్యార్థులు చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ రోడ్డుపైకి వచ్చారన్నారు. చంద్రబాబు విజన్ కలిగిన నాయకుడు అన్నారు. మూడు నెలల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ,జన సైనికులతో కలిసి ముందుకు వెళ్లాలన్నారు.రెండు పార్టీల నాయకత్వం దీనిపై కార్యచరణ ప్రకటిస్తారన్నారు. నవంబర్ 1 నుంచి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ 45 రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు యనమల కృష్ణుడు, పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

కాలినడకన అన్నవరానికి యాత్ర

యస్.రాయవరం:టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు త్వరగా విడుదల కావాలని హైదరాబాద్ ఐటీ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగి మద్దాల శ్రీనివాసరావు తన స్వగ్రామమైన యస్ రాయవరం నుండి కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయానికి కాలినడకన పాదయాత్ర చేపట్టారు.సోమవారం నక్కపల్లి మండలంలో జరిగిన నియోజవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాయకరావుపేట ఎన్నికల పరిశీలకులు యనమల రామకృష్ణుడు శ్రీనివాసరావును సన్మానించినట్టు మాజీ సర్పంచ్ సీనియర్ నాయకులు కందుల వెంకటేశ్వరరావు తెలిపారు.


ఇన్సూరెన్స్ చెక్కు అందజేస్తున్న డైరెక్టర్

పాడి రైతులకు విశాఖ డెయిరీ అండ

ప్రజాశక్తి-గొలుగొండ:పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాడి రైతులకు అన్ని విధాలా విశాఖ డెయిరీ ఆదుకుంటుందని డెయిరీ డైరెక్టర్ చిటికెల రాజకుమారి తెలిపారు. శ్రీరాంపురం పాల సేకరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కొత్త జోగంపేట గ్రామానికి చెందిన రాయపురెడ్డి బుజ్జి పాడి గేదె ఇటీవల మృతి చెందడంతో ఇన్సూరెన్స్ చెక్కును రైతుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.